APTEL/25/A2326

# ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

పంపుటి : 1 | సంచిక : 8 | ఒంగోలు | బుధవారం 10-9-2025 | ఎడిటర్ : కుమార్ | పబ్లిషర్ : నరాల మురళీ | పేజీలు : 4 | వెల : రూ. 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar





## ఉపరాష్ట్రపతిగా ఎన్డీఏ అభ్యర్థి
# సి.పి.రాధాకృష్ణన్ విజయం

న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :
ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బీఎస్ సుదర్శన్ రెడ్డిపై విజయం సాధించారు. దీనితో భారత 17వ ఉపరాష్ట్రపతి అయ్యారు. ఎన్డీఏ అభ్యర్థిగా నిలబడిన ఆయనకు 452 ఓట్లు రాగా, ఇండియా కూటమి తరఫున పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. దీనితో 152 ఓట్ల మెజారిటీతో రాధాకృష్ణన్ ఘనవిజయం సాధించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ఎలక్టోరల్ కాలేజ్‌లో మొత్తం 781 మంది సభ్యులు ఉండగా, అందులో 752 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో 15 ఓట్లు మిగతా 2లో

## కాంగ్రెస్‌కు
# కవిత మద్దతు!
### బీఆర్ఎస్ న్యూట్రల్



హైదరాబాద్, ప్రజలకు చేరువ ప్రతినిధి :
ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తన సాంప్రదాయ తటస్థ వైఖరిని కొనసాగిస్తే, పార్టీ అధినేత కే. చంద్రశేఖర్ రావు కుమార్తె తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత మాత్రం అందుకు భిన్నంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ భిన్నాభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. బీఆర్ఎస్ వైఖరి: తటస్థం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మీడియా సమావేశంలో తమ పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. "మేము ఏ కూటమికి మిగతా 2లో

## అణుశక్తి అంటే విధ్వంసం కాదు
# ఆవిష్కరణలకు నాంది!
### విజయవాడలో అణుసాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శన
### అణుశక్తి అపోహలు దూరం చేస్తూ
### శాస్త్రీయ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



విజయవాడ, ప్రజలకు చేరువ ప్రతినిధి :
ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. కానీ చాలామందికి ఇప్పటికీ "అణుశక్తి అంటే విధ్వంసమే" అన్న అపోహ ఉంది. ఈ అపోహలను తొలగించడానికి, అణుశక్తి వినియోగాలను చూపించడానికి విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు శాస్త్రవేత్తలతో కలిసి ప్రత్యేక వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కల్పక్కం శాస్త్రవేత్తలతో సంయుక్త ప్రదర్శన: తమిళనాడులోని కల్పక్కం ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటమిక్ రీసెర్చ్ నిపుణుల ఆధ్వర్యంలో విజయవాడ పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వ్యవసాయం, వైద్యం, మిగతా 2లో

# 'కేంద్రానికి మాది బేషరతు మద్దతు'
### ట్రంప్ సుంకాల నిర్ణయాల ప్రభావం రాష్ట్రంపై పడనివ్వం!




**కోయంబత్తూరు :** కేంద్ర ప్రభుత్వానికి తమది బేషరతు మద్దతని ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తమిళనాడులోని కోయం బత్తూరులో జరుగుతున్న 'ఇండియాటుడే కాంక్లేవ్ సౌత్ 2025'లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ప్రముఖ మిగతా 2లో

# యూరియా అందుబాటులో ఉంది
### వారి మాటలు నమ్మొద్దు: మంత్రి అచ్చెన్న



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** వైఎస్సార్సీపీ హయాంలో యూరియా కోసం రైతులు అవస్థలు పడ్డారని కూటమి ప్రభుత్వం ముందుగానే యూరియా సరఫరా చేసి కొరతకు తెరదించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు చొరవ వలన, కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడటం వలన అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా మిగతా 2లో



## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ
# బలోపేతం
### రంగాలవారీగా చూస్తే..
### జాతీయ సగటు కంటే అధిక వృద్ధి సాధన

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :**
సుస్థిర ఆర్థిక వ్యవస్థను సాధించాలంటే వృద్ధి లక్ష్యాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, త్రైమాసిక ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా పెట్టుకున్న 17.1 శాతం వృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. జాతీయ సగటును మించి, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీఎస్డీపీలో వృద్ధి నమోదైందని రాష్ట్ర ప్రణాళికా విభాగం అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో, రాష్ట్ర ప్రణాళిక శాఖ అధికారులు 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక వృద్ధి అంచనాలను ముఖ్యమంత్రికి సమర్పించారు. రెండు అంకెల వృద్ధిపై సంతోషం వ్యక్తం చేసిన సీఎం, "ఎంత లక్ష్యం పెట్టుకున్నాం, దానికన్నా ఎంత ఫలితాలు సాధించాం" అనే విశ్లేషణ అవసరమని అన్నారు. రాష్ట్రానికి విస్తారమైన సముద్రతీరం, సమృద్ధిగా జలవనరులు, మెరుగైన మౌలిక వసతులు వంటి అనేక అంశాలు అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. కొన్ని రంగాలు ఆశించిన పురోగతి సాధించకపోవడానికి కారణాలు ఏమిటో తెలుసుకోవడానికి నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం మిగతా 2లో


# సకాలంలో నిర్దిష్ట ధరలకే ఎరువులు
### ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

IMPORTANT CLAUSES OF FCO 1985

| S.No | Description | Clause No. As per FCO, 1985 |
|---|---|---|
| Sale Related | | |
| 1 | If the dealer, Manufacturer, Importer or Pool handling agency sells any fertilizer at a Price exceeding the maximum price | 3 (3) |
| 2 | If the retail dealer does not display the Stock position and price list of the fertilizers | 4 |
| 3 | If the dealer is not issuing the Cash or Credit memorandum in Form "M" | 5 |
| 4 | Selling of Fertilizers to Industrial Use | 25 |







**ఒంగోలు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులను, ముఖ్యంగా యూరియాను నిర్దిష్ట ధరలకు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రైవేటు డీలర్లు కూడా నిబంధనల మేరకు పని చేస్తూ అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు. జిల్లాలోని ఎరువుల డీలర్లతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ఊపందుకోవటం, ఎరువుల అవసరము - లభ్యత, షాపుల నిర్వహణ తీరు, ఉల్లంఘిస్తే ఎఫ్.సి.ఓ.-1985 చట్టం ప్రకారం తీసుకునే చర్యలపై డీలర్లకు అవగాహన కల్పించారు. జిల్లాలో యూరియాకు కొరత లేదని ఈ సందర్భంగా కలెక్టర్ వృనరుద్ఘాటించారు. అవసరం మేరకు ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో 70 శాతాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా, మిగిలిన 30 శాతాన్ని ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు డీలర్లు కూడా రైతులలో ఎలాంటి ఆందోళనకు ఆస్కారం లేకుండా ఎరువులను విక్రయించాలని ఆమె చెప్పారు. షాపులకు ఎరువులు చేరినప్పటి నుంచి వాటిని రైతులకు విక్రయించే వరకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎరువుల లభ్యతకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఐ.ఎఫ్.ఎం.ఎస్. సైట్ లో నమోదు చేస్తూ ఉండాలని, ఇదే విషయాన్ని వాటి ధరలతో సహా రైతులకు మిగతా 2లో



# మొదలైన రచ్చ !
### ఆయనకు వైఎస్ ఇంటిపేరు

అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :
భారతీయ సంప్రదాయం ప్రకారం వివాహం తరువాత మహిళకు భర్త ఇంటి పేరు మాత్రమే ఉంటుంది. పుట్టింటి పేరు అక్కడే ఉండిపోతుంది. మరీ ముఖ్యంగా తెలుగు నాట దీనిని ఎక్కువగా నమ్ముతారు. ఇపుడు ఈ చర్చ ఎందుకు అంటే రెండు ప్రముఖ తెలుగు రాజకీయ కుటుంబాల నుంచి ఇద్దరు ఆడపడుచులు సొంత రాజకీయం చేస్తున్నారు. వారు తన సొంత వారికే ప్రత్యర్థులుగా మారారు. దానితో వారి పుట్టింటి అత్తింటి పేర్ల మీద చర్చ సాగుతోంది. షర్మిల విషయానికి వస్తే వైసీపీలో ఉన్నంతవరకూ ఆమె వైఎస్ షర్మిలగానే ఉన్నారు. ఆనాడు ఎవరికీ ఏ రకమైన అభ్యంతరాలు అయితే లేవు. ఎపుడైతే ఆమె ఏపీకి పీసీసీ చీఫ్‌గా వచ్చారో నాటి నుంచే ఆమె ఇంటి పేరు వైఎస్ కాదు మొరుసుపల్లి అని నిర్ధారించారు. ఇక కల్వకుంట్ల కవితగా రాజకీయం చేస్తున్న ఆమె ఇంటి పేరు కూడా అది కాదు ఆమె భర్త ఇంటి పేరు అయిన దేవనపల్లి మిగతా 2లో

ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

# సంపాదకీయం

## పెరుగుతున్న మానసిక రుగ్మతలు

ప్రపంచవ్యాప్తంగా చనిపోతున్న ప్రతి వంద మందిలో ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే-మెంటల్ హెల్త్ ఆట్లాస్ 2024' నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది వివిధ మానసిక ఆరోగ్య రుగ్మతలతో జీవిస్తున్నారని తెలిపింది. ఆందోళన, ఒత్తిడి వంటివి ప్రజలను వెంటాడుతున్న మానసిక రుగ్మతలలో ప్రధానమైనవని కూడా గుర్తించింది. 2011-2021 మధ్య కాలంలో మానసిక రోగుల సంఖ్య ప్రపంచ జనాభా పెరుగుదల కంటే వేగంగా పెరిగింది.

మన దేశంలో మానసిక అనారోగ్యం కలిగిన ప్రతి లక్ష మందికి 13 మంది మాత్రమే ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. 2024-25 ఆర్థిక సర్వే సైతం మానసిక ఆరోగ్య సంరక్షణపై ఆందోళన వ్యక్తం చేసింది. యువత మానసిక శ్రేయస్సు దేశ ఆర్థిక అభివృద్ధికి కీలకమైన అంశమని ఆర్థిక సర్వే పేర్కొంది. పని ప్రదేశంలో ఒత్తిడి, సోషల్ మీడియా వినియోగం పెరగడం, పెరుగుతున్న సామాజిక, ఆర్థిక ఒత్తిళ్ల వలన యువత మానసిక ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ పెట్టడం లేదు.

మానసిక ఆరోగ్య సేవలపై కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నది. 2024-25 బడ్జెట్లో రూ.90,659 కోట్లు కేటాయిస్తే, 2025-26 బడ్జెట్లో రూ.99,859 కోట్లు కేటాయించింది. పైగా గత ఐదు సంవత్సరాలుగా మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం కేటాయిస్తున్న నిధులలో ఎక్కువ భాగం ఖర్చు కావడం లేదనే ఆరోపణలు వున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కేటాయింపులు చేయకుండా మానసిక ఆరోగ్య సంరక్షణ ఎలా సాధ్యం? మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ వంటి సంస్థలకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది. మరోవైపు కేటాయించిన నిధులను విడుదల చేయడం లేదు. దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యంపై టెలి కౌన్సిలింగ్ అందించడానికి 2022లో టెలి మానస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2025 ఫిబ్రవరి నాటికి 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 53 సెంటర్ల ద్వారా టెలి కౌన్సిలింగ్ అందించారని అంచనా. వాస్తవానికి మానసిక అనారోగ్యం కలిగిన వారందరికీ టెలి మెడిసిన్ సేవలు చేరడంలో నిర్లక్ష్యం ఉంది. నిధుల కొరత వలన అనేక రాష్ట్రాల్లో టెలి కౌన్సిలింగ్ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. 1982 నుండి జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలవుతున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 767 జిల్లాల్లో అమలవుతున్నది. దీనిని సమర్థవంతంగా నిర్వహించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ప్రధాన ఆటంకంగా ఉంది. భారతదేశంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మానసిక ఆరోగ్య సంరక్షణ కీలకమైంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్ దయాళ్ వికలాంగుల పునరావాస పథకం, వికలాంగుల హక్కుల అమలు పథకాలకు 2025-26 బడ్జెట్లో రూ.280 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఆరు సంవత్సరాల నుండి నిధుల కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. దేశంలో యువత మానసిక ఆరోగ్యం, జీవనశైలి, సోషల్ మీడియా వినియోగం, మానసిక ఆరోగ్య సంరక్షణపై బహిరంగ కార్యక్రమాలను నిర్వహించడం యువతలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కీలకమైన అంశమని ఆర్థిక సర్వే పేర్కొంది. కానీ కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాల అమలుకు ఆటంకం ఏర్పడుతున్నది.

(మొదటి పేజీ తరువాయి)

## 'కేంద్రానికి మాది బేషరతు మద్దతు'

పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. పలు బిల్లులు, ఇతర సమయాల్లో కేంద్ర నిర్ణయాలకు మద్దతు తెలిపితేనే రాష్ట్రానికి నిధులిచ్చే పరిస్థితి ఉంటుందా అని అడగ్గా ఎలాంటి షరతుల్లేకుండా తాము కేంద్రానికి రాజకీయంగా మద్దతుగా ఉన్నామని లోకేశ్ బదులిచ్చారు.

కేంద్రాన్ని నిధులు అడగడం రాజకీయ పరిస్థితులకు భిన్నమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తాము ప్రత్యేక సంస్కరణలు తెస్తున్నామని, ఇందుకోసం కేంద్ర సహకారం తీసుకుంటున్నామని వివరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల నిర్ణయాల ప్రభావం రాష్ట్రం మీద పడకుండా పకడ్బందీ వ్యూహాలతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. సుంకాల సవాళ్లను అధిగమించేందుకు సంస్కరణలను తీసుకొచ్చే పనిలో ఉన్నామన్నారు.

**మంచి నగరం నిర్మిస్తున్నాం :** ఏపీలో కడుతున్న అమరావతి సుస్థిరంగా ఉంటుందా అనే ప్రశ్నకు భారత్‌కు 100 అమరావతిలు కావాలన్నారు. సైబరాబాద్ కూడా అలా తెచ్చిందేనని లోకేశ్? తెలిపారు. ఫలితంగా తెలంగాణ లబ్ధి పొందుతోందని, చంద్రబాబు లాంటి విజనరీ నాయకుడు ఉండడం అవసరమని పేర్కొన్నారు. 35 వేల ఎకరాల్లో మంచి నగరం నిర్మిస్తున్నామని, ఫలితాలను భవిష్యత్తులో చూడబోతున్నారు అని తెలిపారు. టీసీఎస్‌కు తక్కువ రేటుకు భూములిచ్చిన వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. టీసీఎస్ 25 వేల ఉద్యోగాలిస్తే అది ఆంధ్రప్రదేశ్‌కే ఉపయోగమని వివరించారు. వారు అలాంటి వాతావరణాన్ని తెస్తున్నారని, హైదరాబాద్‌లో 5వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు ఎందుకని అప్పట్లో కొందరు విమర్శించారని గుర్తు చేశారు. ఇప్పుడు బెంగళూరు లాంటి నగరాల్లో రెండో విమానాశ్రయానికి వెళ్తున్నారని అన్నారు. త్రిభాషా విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, కేంద్రం పరోక్షంగా హిందీని రుద్దాలని చూస్తోందని ప్రశ్నించినప్పుడు లోకేశ్ స్పందిస్తూ.. "మాతృభాష ప్రధానమైనదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెబుతున్నారు. మేం తెలుగుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. భారతీయులుగా హిందీ నేర్చుకుంటున్నాం. నా కుమారుడు సైతం 3 భాషలు నేర్చుకుంటున్నాడు. ఏపీలో ప్రస్తుతం జర్మన్, జపనీస్ కూడా నేర్చుకుంటున్నారు. విదేశాల్లో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. భాషలు నేర్చుకునే అంశంలో పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలి" అని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సి.పి. రాధాకృష్ణన్‌కు మద్దతిస్తారా లేక తెలుగు బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికా అని అడిగినప్పుడు "ఎన్డీయే అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్‌కే మద్దతిస్తామని స్పష్టం చేశారు. ఎన్డీయేకు ఎప్పటికీ మద్దతు ఉంటుందా అని ప్రశ్నించినప్పుడు 2029లో ఎన్నికల వరకే కాదు, ఆ తర్వాత కూడా మద్దతుగా నిలుస్తామని లోకేశ్ చెప్పారు. 2019లో ఎందుకు వ్యతిరేకించారని అడిగినప్పుడు.. "మేం మనుషులం. తప్పుచేశాం, వాటిని సరిదిద్దుకుని ముందుకెళ్తున్నామ ని సమాధానమిచ్చారు. మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధాని 30 రోజులు జైల్లో ఉంటే రాజీనామా చేయాలనేదానికి మీరు మద్దతిస్తారా అని ప్రశ్నించినప్పుడు.. "దేశంలో స్వచ్ఛమైన రాజకీయాలు ఉండాలి. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుపడాలి. అవినీతి పోవాలి. రాజకీయ నేపథ్యమున్న అవినీతి కేసుల్లో ఏడాదిలో తీర్పులివ్వాలని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. అది జరగలేదు. ఈ నేపథ్యంలో సంస్కరణలు అవసరం. మా సూచనలు కూడా చెప్పాం" అని అన్నారు. చంద్రబాబును జగన్ జైల్లో పెట్టారు, ఇప్పుడు చంద్రబాబు వచ్చారు కాబట్టి జగన్‌ను జైలుకు పంపుతారా అని ప్రశ్నించగా.. "అది మా ఎజెండా కాదు. చేయాలనుకుంటే ఎప్పుడో చేసేవాళ్లం. మా ప్రాధాన్యం ఏపీ అభివృద్ధి. నాతోపాటు ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే దాని పర్యవసానం అనుభవించాల్సిందే. నేను తప్పుచేస్తే మా నాన్నే నన్ను జైలుకు పంపుతారు. మరో ఆలోచనే లేదు" అని తెలిపారు. ఎన్టీఆర్, చంద్రబాబుతో పోల్చితే మీరెలా ప్రత్యేకం అన్నప్పుడు.. "వారిద్దరూ నాకు స్ఫూర్తి. నా జీవితకాలపు ఉపాధ్యాయుడు నా తండ్రి. కొన్నిసార్లు క్యాబినెట్‌లో ఆయన ఆలోచనలతో కూడా విభేదిస్తాను. ఆయన వింటారు. నన్ను ఎవరూ బలవంతంగా రాజకీయాల్లోకి లాగలేదు. నేను స్ఫూర్తి పొంది.. ప్రజలంటే ఇష్టంతో వచ్చాను. సంస్కరణలు తెచ్చేందుకు రాజకీయాల్లోకి యువత రావాలి" అని వెల్లడించారు. పెట్టుబడుల సాధనకు సహకారమివ్వండి – ప్రధాని మోదీని కోరిన మంత్రి లోకేశ్

**కర్ణాటక వద్దంటే మేం ఆహ్వానించాం :** కర్ణాటక ప్రభుత్వం తిరస్కరించిన తర్వాతే హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌ను ఏపీకి ఆహ్వానించినట్లు లోకేశ్ తెలిపారు. ఏపీ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనా పెట్టుబడుల ఆకర్షణలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడుతున్నట్లు వివరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలతో పాటు ఇతర ప్రముఖ సంస్థలూ ఏపీవైపు చూస్తున్నాయన్నారు. పెట్టుబడుల ఆకర్షణ విషయంలో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్‌లతో పోటీపడేందుకు పరిశ్రమలకు తక్కువ ధరకే భూములు, మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని వివరించారు. రాష్ట్రానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. అందుకే దేశంలో అతిపెద్ద ఉక్కు కర్మాగారం, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు వచ్చాయని. ఏపీలో పరిశ్రమలకు అనువైన పరిస్థితులూ అందుకు కారణమన్నారు. స్పేస్ సెక్టార్ అభివృద్ధికి ఇటీవల 200 ఎకరాలను మేం కేటాయించినట్లు తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇది దోహదపడుతుందని వెల్లడించారు.

## యూరియా అందుబాటులో ఉంది

2 రోజుల్లో రాష్ట్రానికి రానుందని వెల్లడించారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా సమస్య లేదని వైఎస్సార్సీపీ కావాలని రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. రబీకి కేంద్రం 9.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందంటుని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

'సీఎం చొరవ వల్ల అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుంది. వైఎస్సార్సీపీ హయాంలో యూరియా కోసం రైతులు అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం ముందుగానే యూరియా సరఫరా చేసి కొరతకు తెరదించింది. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచుతున్నాం. ఎక్కడా యూరియా సమస్య లేదు వైఎస్సార్సీపీ కావాలని రాజకీయం చేస్తోంది. రబీకి 9.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. రూ.130 కోట్లు ఖర్చు చేసి 7.37 లక్షల మందికి విత్తనాలు రాయితీతో అందించాం. ఉచిత పంటల బీమా పేరుతో వైఎస్సార్సీపీ మోసం చేసింది'.– అచ్చెన్నాయుడు, మంత్రి రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు: నాడు వ్యవసాయాన్ని నాశనం చేసిన వైఎస్సార్సీపీ నాయకులు నేడు అన్నదాత పోరు పేరుతో గొడవలు సృష్టిస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకపోయినా రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 1,500 టన్నుల యూరియా బ్లాక్ మార్కెట్‌లో అమ్మేసిన చరిత్ర గత ప్రభుత్వ నేతలదని మండిపడ్డారు. మామిడి, పొగాకు, కోకో, ఉల్లికి కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతుల్ని ఆదుకుందని తెలిపారు. వైఎస్సార్సీపీ నేతలు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటే తాము 68 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వెల్లడించారు. 24 గంటల్లో ధాన్యం కొనుగోలు సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ఉల్లికి వైఎస్సార్సీపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించలేదని కానీ తాము క్వింటాలు రూ.1,200 చొప్పున కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్నదాతల్ని అన్ని విధాలా ఆదుకుంటున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. జేపీ నడ్డాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు: రాష్ట్రానికి మరిన్ని ఎరువుల కేటాయింపుపై కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. కాకినాడ తీరానికి చేరుకున్న నౌకలోని 7 ర్యాక్‌ల నుంచి రాష్ట్ర అవసరాలకు యూరియా కేటాయించాలని ఆయన కోరారు. సీఎం విజ్ఞప్తి మేరకు స్పందించిన కేంద్ర మంత్రి ఏపీకి అదనంగా మరో 50,000 టన్నుల యూరియాను కేటాయించారు. కాకినాడ పోర్టులో 17,593 టన్నుల దిగుమతికి వెంటనే ఉత్తర్వులు కూడా ఇచ్చారు.

## సి.పి.రాధాకృష్ణన్ విజయం

చెల్లుబాటు కాకుండా పోయాయి. వాస్తవానికి ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక కావాలంటే 377 ఓట్లు సాధించాలి. అయితే అధికార ఎన్?డీఏ కూటమి తరపున పోటీ చేసిన సీపీ రాధాకృష్ణన్?కు 452 ఓట్లు వచ్చాయి. ఇండియా కూటమి తరపున పోటీ చేసిన జస్టిస్? బి సుదర్శన్? రెడ్డికి 300 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీనితో జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై రాధాకృష్ణన్ సునాయాసంగా (152 ఓట్ల భారీ మెజారిటీ) గెలిచారు.

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో : జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి భర్తీ చేసేందుకు ఇవాళ పోలింగ్ జరిగింది. ఈ పదవి కోసం ఎన్?డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పోటీపడ్డారు. ఈ పోలింగ్‌లో మొదట ప్రధాని నరేంద్రమోదీ ఓటు వేశారు. తర్వాత వరుసగా కేంద్రమంత్రులు ఓటు వేశారు. ఈ ఎన్నికలో ఎంపీలకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేయగా తమ ప్రాధాన్యం ప్రకారం ఆయా అభ్యర్థులకు ఓట్లు వేశారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఇతర సీనియర్‌నేతలు వరుసగా వచ్చి ఓటు వేశారు. సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్ సహా ఇండీ కూటమి నేతలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## కవిత మద్దతు!

చెందినవాళ్లం కాదు. మా లక్ష్యం కేవలం తెలంగాణ ప్రజల ప్రయోజనాలే," అని ఆయన ప్రకటించారు. దీంతో, ఎన్డీఏ అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్‌కు గానీ, ఇండియా బ్లాక్ అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి గానీ తమ మద్దతు లేదని బీఆర్ఎస్ తేల్చి చెప్పింది. ఇది పార్టీ యొక్క నిలకడైన స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రతిబింబిస్తుంది. ఇండియా బ్లాక్ అభ్యర్థికి కవిత మద్దతు అయితే బీఆర్ఎస్ నిర్ణయానికి భిన్నంగా కవిత స్పందించారు. మంగళవారం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె "తెలంగాణ బిడ్డ అయిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతిగా గెలవాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండే వ్యక్తి అని, ఆయన పదవికి గౌరవాన్ని తీసుకొస్తారని కవిత ప్రశంసించారు. ఆమె వైఖరి పార్టీలోని కొంతమంది నేతల వ్యక్తిగత అభిప్రాయాలను బయటపెట్టిందని చెప్పవచ్చు. ఇది రాజకీయాల్లో కుటుంబ సభ్యుల మధ్య కూడా భిన్నమైన ఆలోచనలు ఉండవచ్చని సూచిస్తుంది. ఈ వివాదంపై కవిత మాట్లాడుతూ తెలంగాణ జాగృతి సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. "మా రాజకీయ ప్రయాణం అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతుంది" అని ఆమె అన్నారు. కవిత, తమ పార్టీ ప్రస్థానంలో కేటీఆర్ స్ఫూర్తితోనే పని చేస్తామని చెప్పడం ద్వారా, వ్యక్తిగత భిన్నాభిప్రాయాలు ఉన్నా, పార్టీ లక్ష్యాలు ఒకటేనని పరోక్షంగా సూచించారు. ఈ పరిణామం బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం, లేదా భిన్న అభిప్రాయాలకు చోటు ఉందా అనే చర్చను రేకెత్తించింది. అయితే కవిత , కేటీఆర్‌ల ప్రకటనలు వారి రాజకీయ పంథాను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా తెరపైకి వచ్చిన ఈ అంశం, భవిష్యత్ తెలంగాణ రాజకీయాలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వేచి చూడాలి.

## ఆవిష్కరణలకు నాంది!

అంతరిక్షం, రక్షణ రంగాల్లో అణుశక్తి వినియోగంపై స్పష్టమైన అవగాహన కల్పించడమే దీని లక్ష్యమని విద్యార్థులు చెప్పుకొచ్చారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం దీనిని సమన్వయం చేసింది.

వైద్యంలో అణు సాంకేతిక వినియోగం: క్యాన్సర్ చికిత్సలో ఇప్పటికీ అనేక రోగులు కీమోథెరపీ వాడకం వల్ల జుట్టు ఊడిపోవటం, బలహీనత వంటి దుష్ప్రభావాలను ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగా బాబాట్రాన్ పరికరంను ప్రదర్శనలో చూపించారు. ఈ పరికరంలో ఉండే కోలిమీటర్ సాంకేతికత వల్ల క్యాన్సర్ కణితిపై నేరుగా చికిత్స చేయవచ్చు. దీంతో ఆరోగ్యకర కణాలు ప్రభావితం కావు. రోగికి అనవసరమైన బలహీనత రాదు.

వ్యవసాయం, ఆహార భద్రతలో అణుశక్తి: వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పదార్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం పెద్ద సవాలుగా ఉంటుంది. దీని పరిష్కారం గామా ఛాంబర్ పరికరం. గామా కిరణాల సాయంతో ధాన్యాలు, పండ్లు, కూరగాయలు చెడిపోకుండా ఎక్కువకాలం నిల్వ చేయవచ్చు. దీని వల్ల రైతులకు అధిక లాభం, వినియోగదారులకు భద్రత కలుగుతుంది. అలాగే గామా కంపాక్ట్ పరికరం రక్తాన్ని శుద్ధి చేయడంలో విస్తృతంగా ఉపయోగపడుతుందని విద్యార్థులు వివరించారు.

రక్షణ, అంతరిక్ష రంగాల్లో అణు సాంకేతికత: ప్రదర్శనలో న్యూక్లియర్ రియాక్టర్ పనితీరు, అణుఇంధనం ఉత్పత్తి, ప్రోటోటైప్ బ్రీడర్ రియాక్టర్లు వంటి సాంకేతిక అంశాలను ప్రదర్శించారు. రక్షణ రంగంలో అణుశక్తి ఆధారిత పరికరాల ప్రాముఖ్యతను కూడా వివరించారు. అంతరిక్ష పరిశోధనల్లో దీని ఉపయోగం వల్ల కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు.

ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యం: ఈ ప్రదర్శనకు హాజరైన పాఠశాల, కళాశాల విద్యార్థులకు పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులే గైడ్‌లుగా పని చేశారు. అణుశక్తి వల్ల విధ్వంసం కాకుండా మానవ సంక్షేమం కోసం అనేక వినూత్న ఆవిష్కరణలు సాధ్యమని వారు వివరించారు. అణుశక్తి ఒక భయంకరమైన విధ్వంస శక్తి మాత్రమే అన్న అపోహలను చెరిపేసి, దాన్ని సమర్థవంతంగా వినియోగిస్తే వ్యవసాయం, వైద్యం, రక్షణ, అంతరిక్షం వంటి రంగాల్లో మానవాళి పురోగతికి ఎంతగానో దోహదం చేస్తుందని ఈ వైజ్ఞానిక ప్రదర్శన తెలియజేసింది. సరైన దారిలో ఉపయోగిస్తే అణుశక్తి మన భవిష్యత్తును మరింత సురక్షితంగా, సుసంపన్నంగా మార్చగలదనే సందేశం అందరికి చేరింది.

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

చేయాలని సూచించారు. పర్యాటక రంగం ప్రస్తుతం 17.08 శాతం పురోగతి సాధించినా, కనీసం 25 శాతం వృద్ధి సాధించే అవకాశం ఉందని సీఎం స్పష్టం చేశారు. వృద్ధి పరంగా అంతర్జాతీయ ప్రమాణాలు సాధించడమే లక్ష్యమని ఆయన అన్నారు. రైల్వే, రవాణా, హోటళ్లు, కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, రియల్ ఎస్టేట్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అంతేకాక, శాఖలు, రంగాలు, నియోజకవర్గాల వారీగా జీఎస్డీపీ వివరాలను మరింత లోతుగా నమోదు చేయాలని ఆదేశించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీఎస్డీపీ వృద్ధి విలువ 3,57,894 కోట్లకు చేరిందని అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే కాలంలో 9.58 శాతం వృద్ధి నమోదు కాగా, ఈసారి 10.50 శాతం వృద్ధి సాధ్యమైందని వివరించారు. దేశ జీడీపీ వృద్ధి రేటు 8.8 శాతం మాత్రమే కాగా, ఆ కంటే ఎక్కువ వృద్ధి సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా బలోపేతమైందని రుజువైంది.

రంగాలవారీగా చూస్తే: పరిశ్రమల శాఖలో 11.91 శాతం, సేవల రంగంలో 10.70 శాతం, వ్యవసాయ రంగంలో 9.60 శాతం, జీవీఏలో 10.76 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. పశుపోషణ ఉత్పత్తి విలువ 6.65 శాతం పెరిగి 46,751 కోట్లకు చేరింది. చేపల పెంపకం–ఆక్వాకల్చర్ 14.52 శాతం వృద్ధితో 32,110 కోట్లకు పెరిగింది. మాంసం ఉత్పత్తి 8 శాతం పెరిగి 3.15 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 3.41 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. గుడ్ల ఉత్పత్తి 62,157 లక్షల నుంచి 67,450 లక్షలకు పెరిగింది. మైనింగ్–క్వారీయింగ్ రంగం 43.54 శాతం వృద్ధి సాధించి 10,686 కోట్లకు చేరింది. తయారీ రంగం 9.93 శాతం వృద్ధితో 40,515 కోట్లకు చేరింది. నిర్మాణ రంగం 31,550 కోట్లతో 9.57 శాతం వృద్ధి నమోదు చేసింది. రోడ్ మెటల్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ ఉత్పత్తి పెరిగిందని అధికారులు వివరించారు.

హోటళ్లు, రవాణా, పర్యాటక రంగం 25,702 కోట్లకు పెరిగి 17.92 శాతం వృద్ధి నమోదు చేసింది. రియల్ ఎస్టేట్– ప్రొఫెషనల్ సర్వీసులు 11.70 శాతం వృద్ధితో 34,324 కోట్లకు చేరాయి. పర్యాటకులు 17.08 శాతం పెరిగి 6.89 కోట్ల నుంచి 8.07 కోట్లకు చేరారు. విమాన ప్రయాణికులు 21.1 శాతం వృద్ధితో 13.09 లక్షల నుంచి 15.85 లక్షలకు పెరిగారని అధికారులు వివరించారు.

## సకాలంలో నిర్దిష్ట ధరలకే ఎరువులు

తెలిసేలా షాపుల ముందు కూడా డిస్ప్లే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎం.ఆర్.పి. కంటే అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చట్టప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఎరువులను కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని పునరుద్ఘాటించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేలా ఎరువుల షాపులను తనిఖీ చేసేందుకు రెవిన్యూ, పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్, వ్యవసాయ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను కాలానుగుణంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎరువులను వినియోగించేలా రైతులకు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలోనే ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఎరువుల డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. యూరియా విక్రయాలతో నానో యూరియా విక్రయాలకు ముడి పెట్టవద్దని ఆయన చెప్పారు. రైతులకు ఆందోళన కలిగించే పరిణామమేదీ డీలర్ల వైపు నుంచి చోటు చేసుకోకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మొదలైన రచ్చ !

అని కూడా డిసైడ్ చేశారు. ఇదిలా ఉంటే సోమవారం షర్మిలతో పాటు ఆమె కుమారుడు రాజారెడ్డి కర్నూల్ కి వెళ్ళారు. ఆయన రాజకీయ అరంగేట్రం చేస్తారు అని ఈ సందర్భంగానే పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. మీడియా సైతం దానిని హైలెట్ చేసింది. అంతే కాదు వైఎస్ రాజారెడ్డి అని కూడా ప్రచారం సాగింది. అయితే దీని మీద సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఆయన ఇంటి పేరు వైఎస్ ఎలా అవుతుంది. ఆయన మొరుసుపల్లి కదా అంటూ లాజిక్ పాయింట్లు లేవదీస్తున్నారు అయితే వైఎస్ రాజారెడ్డి అంటే వైఎస్సార్ తండ్రి. ఆయన ఆ కుటుంబంలో మొదటి తరం రాజకీయ నాయకుడు. పులివెందుల సర్పంచుగా చాలా కాలం పనిచేశారు. ఆయన పేరు షర్మిల కుమారుడికి పెట్టారు అని అంటారు. అంతవరకూ బాగానే ఉన్నా వైఎస్ రాజారెడ్డి అంటే పెద్దాయన గుర్తుకు వస్తారు కదా అని వైసీపీ అభిమానులు సోషల్ మీడియా యాక్టివిస్టులు అంటున్నారు. అందువల్ల వైఎస్ రాజారెడ్డి అంటే నో ఎస్ అని అనేస్తున్నారు. వైఎస్ బ్రాండ్ కోసమేనా : వైఎస్ అన్నది ఏపీలో పవర్ ఫుల్ పొలిటికల్ బ్రాండ్. ఆ బ్రాండ్ కోసమే ఫైటింగ్ అన్నా చెల్లెలు మధ్య సాగుతోంది అని అంటున్నారు. తానే అసలైన వైఎస్సార్ వారసురాలు అనిపించుకోవడానికి షర్మిల ఒక వైపు ప్రయత్నం చేస్తున్నారు. ఆమె తన తండ్రి ఆశయాలను బీజేపీ వ్యతిరేక భావజాలాన్ని సైతం గుర్తు చేస్తున్నారు. అంతే కాదు వైఎస్సార్ కి సిసలైన వారసత్వం తనదే అని అంటున్నారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్

## బహిరంగ సభ ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి



**అనంతపురం, ప్రజలకు చేరువ ప్రతినిధి :** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో అనంతపురంలో ఈ నెల 10న జరగనున్న సూపర్ సిక్స్ – సూపర్ హిట్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.వి.ఎన్ విజయకుమార్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పరిశీలించారు.

# కొత్త వీధిలో తాగునీటి సమస్య

## కలుషిత నీటితో గొంతు తడుపుకుంటున్న ఆదివాసీలు

## ఆదివాసుల దరి చేరని ఇంటింటి మంచినీటి పథకం



**చీడికాడ,ప్రజలకు చేరువ ప్రతినిధి :** సుమారు 40 ఏళ్లుగా నివసిస్తున్న ఆదివాసి గిరిజనులకు గుక్కెడు తాగునీరు దొరకని పరిస్థితి నేడు కనిపిస్తుంది. గొంతు తడుపుకునేందుకు ఆకులు అలములు పడి కుళ్లి పోతు కలుషితమైన నీటిని ఉపయోగిస్తున్నారు. ఎక్కడో మారుమూల ఏజెన్సీ ప్రాంతం అనుకుంటే పొరపాటే. అనకాపల్లి జిల్లా కేంద్రానికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదివాసి గిరిజన గ్రామంలో సుమారు 10 కుటుంబాల ఆదివాసీలు జీవిస్తున్నారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని కోనాం పంచాయతీ శివారు కొత్త వీధి గ్రామానికి రక్షిత మంచినీటి పథకం గాని, తాగునీటి బోరు సైతం ప్రభుత్వం కల్పించలేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి పథకం సైతం ఈ గ్రామంలో ఏర్పాటు చేయలేదు. దీంతో తాగేందుకు స్వచ్ఛమైన నీరు దొరకక ఊట గడ్డ నీటిని సేవిస్తూ అనారోగ్యాలకు గురై ఆస్పత్రిలో చేరిన సంఘటనలు లేకపోలేదు. గతంలో ఇదే గ్రామానికి చెందిన నలుగురు ఐదుగురు అనారోగ్యాల బారిన పడి మృతి చెందిన సంఘటనలు లేకపోలేదు. వీరి పోరాటాలతో స్పందించిన అధికారులు గ్రామంలో బోరు ఏర్పాటు చేసి ఇంటింటికి తాగు నీటిని కల్పించే చర్యలకు శ్రీకారం చుట్టగా ఆ భూములతో సంబంధం లేని వ్యక్తి వచ్చి అడ్డుకోవడం తో ఆపనులు కాస్త నిలిచిపోయాయి, దీనిపై సర్వే నిర్వహించిన అధికారులు అడ్డుకున్న వ్యక్తికి సంబంధం లేదని చెబుతున్నప్పటికీ సంబంధిత తాగునీటి సరఫరా విభాగపు అధికారులు మీనా మీసాలు లెక్కిస్తున్నారే కానీ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు శ్రద్ధ చూపడం లేదు. దీంతో గ్రామస్తులు తాగినందుకు నీరు లేక అష్ట కష్టాలు పడుతున్నారు. గ్రామస్తులకు రేషన్ ఆధార్ కార్డులు ఉండడమే కాకుండా ఓటర్ల జాబితాలో సైతం వీరి పేర్లు నమోదయి ఉన్నాయి. ఎన్నికల ముందు గ్రామానికి వచ్చి సకల సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చే నేతలు ఎన్నికల అనంతరం మర్చిపోతుండడంతో తమ జీవితాలు అడవి కాచిన వెన్నెల మారాయని ఆదివాసి గిరిజనులు ఆవేదన వ్యక్తపరిచారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి తమకు తాగనీటి సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజనులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జిగా లీలా శ్యాంసుందరి

## 13న జరుగు లోక్ అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకోండి



**సింగరాయకొండ ప్రజలకి చేరువ ప్రతినిధి :** సింగరాయకొండ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ విభాగం) నకు రెగ్యులర్ ప్రాతిపదికన న్యాయమూర్తిగా వి.లీలా శ్యాంసుందరి బాధ్యత తీసుకున్నారు. ఆమెను సింగరాయకొండ బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇకపై రెగ్యులర్ గా సింగరాయకొండ కోర్టును నిర్వహిస్తారని, అదేవిధంగా ఈనెల 13 న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సింగరాయకొండ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కేసులు త్వరితగతిన పరిష్కారం పొందేందుకు లోక్ ఆధాలాట్ మంచి వేదిక అని, దీని ద్వారా కేసులు పరిష్కారం కావడం వల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని తెలిపారు. సివిల్, క్రిమినల్, వ్యాజ్యేతర కేసులు, పెండింగ్‌లో ఉన్న వివాదాలు వంటి అనేక కేసులను కోర్టులో తీర్పుకు వెళ్లకుండా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కేసులు దీర్ఘకాలం కొనసాగకుండా త్వరగా ముగించడానికి ఇది మంచి అవకాశం అని, దీనిని అందరూ వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేసారు. కార్యక్రమంలో సింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు, కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పంతగాని వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు,రాఘవేంద్ర,రియాజ్ పఠన్, వంశీ, పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకాలపై అవగాహన



**సింగరాయకొండ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సింగరాయకొండ మండలం సోమరాజు పల్లి లో రసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గిద్దాం నానో యూరియా ఎరువులను అలవాటు చేసుకుందాం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మార్వో, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూరియాను అధికంగా వాడటం వల్ల నేల ఆమ్లత్వం పెరిగిపోతుంది నేలలోని పోషకాలు అసమతుల్యత ప్రయోజనకరమైన అంతరాయం కలిగిస్తుందనీ పచ్చని వృక్ష సంపద పెరుగుదలను ప్రోత్సహిస్తుంది కానీ పుష్పించే పండ్ల నిర్మాణం ఆలస్యం అవుతుందనీ అధిక నత్రజని ఉన్న పంటలు తెగుళ్లు,వ్యాధులకు ఎక్కువగా గురి అవుతాయనీ,అదేవిధంగా యూరియా మనకు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని వివరించారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ ఎన్ బి వి రాజేష్ , ఎంపీడీవో డి జయమణి, పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ బోధన



**చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాలలో) కంప్యూటర్ బోధన జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల, ఆదర్శ పాఠశాలలకు వచ్చిన కంప్యూటర్లు అట్టపెట్టెల్లో ములుగుతున్నాయని కథనాలు ప్రచురితమైయ్యాయన్నారు. ఆదర్శ పాఠశాలకు సరఫరా జరిగిన వెంటనే వాటిని అమర్చి విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందిస్తున్నామని, తమ పాఠశాలలో కంప్యూటర్లను వినియోగిస్తున్నామని ఆమె తెలిపారు.

# అవార్డులు అందుకున్న ఆచార్యులకు సన్మానం

## ఎంఈఓ లు రంగయ్య - శ్రీనివాసులు



**మర్రిపూడ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** మర్రిపూడి మండలంలోని తంగళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయులు గుంటగాని భాస్కరరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు, శ్రీనివాసులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో అవార్డు గ్రహీతలైన ఉపాధ్యాయులను తంగెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు,ఈ సందర్భంగా ఎంఈఓ రంగయ్య, శ్రీనివాసులు అభినందిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, విద్య కమిటీ చైర్మన్, నిర్మల సంస్థ చైర్మన్ యేసు పదం, ఉపాధ్యాయులు కిషోర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు, అంతకుముందు తంగెళ్ల పాఠశా లకు చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయులు లక్ష్మణ్ తల్లి పేరు వంద మంది మీద విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. జి రామకృష్ణ రాజు 10 కుర్చీలు బహుమతిగా ఇచ్చారు.

# కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రి తనిఖీ



**పొన్నలూరు ప్రజలకి చేరువ ప్రతినిధి** జిల్లా కలెక్టర్ సూచనల మేరకు, మంగళవారం తహశీల్దార్ పుల్లారావు , ఎంపీడీఓ పి సుజాత పొన్నలూరు మండలం పొన్నలూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఫీవర్ సర్వే, వెక్టర్ కంట్రోల్ యాప్, టీబీ ముక్త్ అభియాన్ సర్వే, శుక్రవారం డ్రై డే పీఎంఎస్ఎంఏ మొదలైన వాటి పై వైద్య అధికారితో చర్చించారు. అన్ని ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. అన్ని గదులు, ఓపీ రూమ్ మొదలైన వాటిని పరిశీలించారు. వైద్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలను పై రోగులతో అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది అందించే వైద్య సేవలతో వారు సంతృప్తి చెందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ పుల్లారావు , ఎంపీడీఓ డాక్టర్ పి. సుజాత, పీహెచ్‌సీ డాక్టర్ ఎ. శ్రీకాంత్ , సీహెచ్ఓ సీహెచ్ భాస్కర్ రావు , హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# కనిగిరిలో అన్నదాత పోరు సక్సెస్

## కార్యక్రమంలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వెంకాయమ్మ

## దద్దాల పిలుపుకు తరలి వచ్చిన రైతులు, వైసీపీ కార్యకర్తలు,

## 30 యాక్ట్ అమలు పరిచిన పోలీసులు



**కనిగిరి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అన్నదాత పోరుకు అడుగడుగునా పోలీసుల ఆంక్షల నడుమ కార్యక్రమం సక్సెస్ అయింది.రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, ముఖ్యంగా యూరియా దొరక్క వారు పడుతున్న తీవ్ర ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు దద్దాల నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ బూచే పల్లి వెంకాయమ్మ,దర్శి శాసనసభ్యులు ప్రకాశం జిల్లా వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు.ముందుగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఇంటి వద్ద నుండి పామూరు బస్టాండ్ మీదగా ఆర్డీవో కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయంలో డిఏఓ బాలాజీ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మరీ ముఖ్యంగా యూరియా దొరక్క వారు పడుతున్న తీవ్ర ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు రావడం, రైతులు పెద్దఎత్తున పాల్గొంటారానే సమాచారం అందటంతో ఎలాంటి అవాంచ్ఛనీయ సంఘటనలు జగకుండ ఉండటకోసం స్థానిక పోలీసులు భారీ బందోబస్తే ఏర్పాటు చెయ్యటమే కాకుండ 30యాక్ట్ ను అమలుపరిసి ఆంక్షలు విధించడంతో పామూరు బస్టాండ్ నుండి ఆర్డీఓ కార్యాలయంవరకు ముఖ్యనాయకులకే అనుమతి లభించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్,వైసీపీ నాయకులు,కే. అదెన్న గుంటక తిరుపతిరెడ్డి,వై ఎం ప్రసాద్ రెడ్డి, మడతల కస్తూరి రెడ్డి,గంగసాని హుస్సేన్ రెడ్డి, చప్పిడి సుబ్బయ్య,పెద్దిరెడ్డి ఓకే రెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, గంగసాని లక్ష్మి, గాయం సావిత్రి,పులి శాంతి,తమ్మనేని సుజాత,యక్కంటి శ్రీనివాసులు రెడ్డి,గజ్జల వెంకటరెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి,కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి,భువనగిరి వెంకటయ్య,దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, మితికాల గురవయ్య, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, సూరసాని మోహన్ రెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, పోలక సిద్ధారెడ్డి, షేక్ నాయబ్ రసూల్, ఆవుల భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, అయిమల్ల నాగమణి, రామనబోయిన శ్రీనివాసులు, రాచపూడి మాణిక్యరావు, గూడూరి అబ్రహం లింకన్, దాసరి మురళి, షేక్ గయాజ్, షేక్ చాంద్ బాషా బుజ్జి, పల్నాటి భాస్కర్ రెడ్డి, పొల్ల సుబ్రహ్మణ్యం, తాతపూడి సురేష్, కాకర్ల వెంకటేశ్వర్లు, పోలు జయరామిరెడ్డి,చిలిపిరెడ్డి సరస్వతి,రేగుల బాలయ్య చౌదరి,దాదిరెడ్డి మాలకొండ రెడ్డి,తూము వెంకటకృష్ణారెడ్డి,వాకమల్ల రాజశేఖర్ రెడ్డి,తాతపూడి సురేష్,తాతపూడి నాని,సిద్దు వెంకటరెడ్డి, చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి,మద్ది తిరుపతయ్య,కస్తాల బాలాజీ, సాని కొమ్ము మధుసూదన్ రెడ్డి,సిరుప గోవర్ధన్ రెడ్డి, ఎర్రబల్లి దేవరాజు,నక్క రామకృష్ణ,షేక్ రహీం భాష, పచ్చవ వెంకటసుబ్బయ్య చౌదరి, గుంటూరు వెంకటేశ్వర్లు చౌదరి, బాల మాలకొండ రెడ్డి మరియు రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గం అనుబంధం విభాగం సభ్యులు,మండల కార్యవర్గ సభ్యులు, వైస్ ఎంపీపీ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, రైతులు,సోషల్ మీడియా సభ్యులు, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పొన్నలూరు పై రెడ్డిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**పొన్నలూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** మండలంలోని పొన్నలూరు, పైరెడ్డిపాలెం గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు సింగరాయకొండ డాక్టర్ ఇ.నిర్మలకుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటను రైతులు పంట నమోదు చేసుకోవాలని, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి భూమి పోర్టల్ నమోదు చేయాలని తెలిపారు.ప్రస్తుతం యూరియా మండలంలో 27టన్నులు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులకి అవసరం మేరకు పంట సాగును బట్టి రైతు సేవా కేంద్రంలో లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా లేదా ప్రవేటు డీలర్ల ద్వారా అందుబాటులోకి తెచ్చి రైతులందరికీ అందేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.యూరియా రసాయనిక ఎరువులను భూసార పరీక్షలు ఆధారంగా అవసరానికి మించి వాడకూడదని,పైపాటుగా నానో యూరియా, నానో డి ఏ పి వాడుకోవాలని సూచించారు. పచ్చి రొట్టె ఎరువుల ద్వారా భూసారాన్ని వృద్ధి చేసుకోవాలని తెలిపారు,రాబోయే రోజుల్లో డ్రోన్ ద్వారా రైతులకు మందులు పిచికారి చేసే విధానం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నల్ల బెర్లి పొగాకు సాగు చేయకూడదని సూచించారు.రాము మాట్లాడుతూ, సహాయకులు ద్వారా ఖరీఫ్ ,రబీ సీజన్లో వేసే ప్రతి కౌలు రైతు మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు మీరు వేసే పంటను తెలియజేసి గ్రామ రెవెన్యూ అధికారులు ద్వారా కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు,ఎరువులు, ధాన్యం అమ్ముకోవడానికి, ప్రకృతి వ్యాపారిత్యాల వల్ల వచ్చే పంట నష్టం లేదా పంట పండకపోతే ఇన్సూరెన్స్, బ్యాంకు నుండి పంట రుణాలు అన్నదాత సుఖీభవ వంటి పథకాలను పొందవచ్చునని తెలియజేశారు.అన్నదాత సుఖీభవ లో లబ్ది పొందని రైతులు చనిపోయిన వారు, తప్పుగా ఆధార కార్డ్ లింక్ అయినవారు, బ్యాంక్ నందు ఎన్ పి సి ఐ కాని రైతులు మీ సంబంధిత గ్రామ వ్యవ సాయ సహాయకులు లేదా గ్రామ రెవెన్యూ అధికా రులను సంప్రదించి సచివాలయం లో సరిచేసు కోవాలి సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి వాటి ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో పంపిణీ చేసేందుకు సంఘా లను బలోపేతం చేయాలని సెక్రటరీలకు సూచిం చారు. మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ అధిక యూరియా, రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడం కాకుండా మన ఆరోగ్యం దెబ్బతిని క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.కావున ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయ పద్ధతి లో పంటలు సాగు చేయాలని సూచించారు. పొన్నలూరు పశు



వైద్యాధికారి పి.శివరామకృష్ణ మాట్లాడుతూ పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు 7శాతం వడ్డీతో 2లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని. అలాగే పశువులకు ఎదకు వచ్చినపుడు లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి 98శాతం ఆడ దూడలు జన్మించే విధంగా కేవలం 150రూపాయలకే వీర్య నాలికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.వీటితోపాటు పశు బీమా, గోకులం షెడ్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేసారు.పైరెడ్డిపాలెం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి కే.తిరుపతమ్మ మాట్లాడుతూ రైతులందరూ యూరియా వాడకాన్ని తగ్గించి భూసార పరీక్షల ఆధారంగా అవసరం మేరకు వాడుకోవాలని, రైతులకు యూరియా అవసరం మేర అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.పై కార్యక్రమంలో పొన్నలూరు తహశీల్దార్ వి . పుల్లారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు టి వి వి.నారాయణ ఏ ఈ ఓ. సుధీర్ కుమార్ , పంచా యతీ కార్యదర్శి ఎం.నారాయణ పైరెడ్డిపాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు వై .సుష్మా,పశు వైద్య సహాయకులు పి.శివ ప్రసాద్ రెండు గ్రామాల పెద్దలు మండవ ప్రసాద్, మండవ మురళి రైతులు పాల్గొన్నారు.

## కూటమి పభుత్వం వ్యవసాయరంగాన్ని

# సంక్షోభంలోకి నెట్టింది

### అచ్చెన్నాయుడు మంత్రి పదవికి అర్హుడేనా?

### కార్యక్రమాన్ని విజయవంతంచేసిన రైతులకు, కార్యకర్తలకు ధన్యవాదములు

### వైసీపీ కార్యకర్తలకు దద్దాల అండగాఉంటారు

### మీడియాతో మాట్లాడిన జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే బూచేపల్లి



**కనిగిరి, ప్రజలకుచేరువ ప్రతినిధి :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మరియు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమకి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి. శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగానీ, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకుగానీ ఏమాత్రం చీమకుట్టినట్టయినా లేదన్నారు. రైతులు క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా?అని ఆయన ప్రశించారు. రైతులు ఇబ్బందులు ఉంటే ఆయనకు భోజనం గుర్తుకు రావడం దౌర్భాగ్యం అన్నారు.రాష్ట్రంలో టీడీపీ కూటమి ఏర్పడిన నాటి నుండి విత్తనాలు మొదలుకోని పంటలు అమ్ముకునే వరకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడు సాగు సీజన్ ఆరంభమైనా ఎక్కడా యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, రోజంతా క్యూలో నిల్చున్నా, ఒక్క బస్తా కూడా దొరకడం లేదని పేర్కొన్నారు.మామూలుగా రూ.200 ఉండాల్సిన యూరియా బస్తా ఈరోజు రూ.400 నుంచి రూ. 600 మధ్యలో కొనాల్సివస్తుందని, బ్లాక్ మార్కెట్‌లకొనాల్సివస్తుందని, బ్లాక్ మార్కెట్‌లో ఒక్కో బస్తాపై రూ.300కు పైగా ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంత కఠోర వాస్తవాలు కళ్ల ముందే కనిపిస్తున్నా, ప్రభుత్వం మాత్రం యూరియా కొరత లేదంటూ బొంకుతోందని ఆక్షేపించింది. అందుకే రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైసీపీ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.2019–24 కాలంలో వైయస్ఆర్‌సీపీ జగనన్న ప్రభుత్వంలో ప్రతి రైతుకు భీమా కల్పించామని,పెట్టుబడి సాయంగా రైతు భరోసా అందించి రైతులను ఆదుకున్నామన్నారు.ఆర్బీకేల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు.ఈ సందర్భంగా రైతులకు అవసరమైన ఎరువులు, యూరియా సహా ఎరువుల కొరత లేకుండా చూడాలని రైతుల చెంతకే వాటిని చేర్చాలని డిమాండ్ చేశారు.దద్దాల నారాయణ యాదవ్ కనిగిరి నియోజకవర్గంలో వైసీపీకి చెందిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు అందుబాటులో ఉంటారని కార్యకర్తలకు భరోసా కలిపించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన రైతులకు, వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు బూచే పల్లి శివప్రసాద్ రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ లు ధన్యవాదములు తెలిపారు.

## కందుకూరులో విజయవంతమైన

# రైతు పోరు బాట






**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతి నిధి :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కందుకూరు నియోజకవర్గం లో చేపట్టిన రైతు పోరుబాట విజయవంతమైంది. మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు అండగా సబ్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కోసం ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం ముద్దు నిద్రపోతుంది ఆ సమస్యలను రైతులతో కలిసి అధికారులు దృష్టికి తీసుకువెళ్లడానికి వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రైతుల సంక్షోభం ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు గాని వ్యవసాయ మంత్రి గా అచ్చం నాయుడు గాని ఏమాత్రం చీమకుట్టినట్టైనా లేదు . రైతులు క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన అచ్చం నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగించేందుకు అర్హుడేనా? రైతుల ఇబ్బందులు ఉంటే ఆయనకు భోజనం గుర్తు రావడం దౌర్భాగ్యం. చేసిన తప్పిదాలకు లెంపలేసుకుని రైతులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి కష్టాలు వారి పట్ల మానవత్వం చూపించాల్సింది పోయి ఇంకా అవమానపరచడం దారుణమన్నారు. రాష్ట్రానికి వచ్చిన ఎరువుల్లో అధిక భాగం ప్రైవేటుకు మళ్ళించడం వల్లే ఈ సమస్య వచ్చిందని అచ్చం నాయుడే స్వయంగా చెప్పాడు.సహజంగా రాష్ట్రాన్ని కేటాయించిన ఎరువులను 50 శాతం ప్రభుత్వము ఆధీనంలోని మార్క్ ఫెడ్ కు 50% ప్రైవేటుకు కేటాయిస్తారు. ఈ ఎరువులను మార్కెట్ యార్డుల ద్వారా పిఎసిఎస్ లు, ఏపీవోల ద్వారా పంపిణీ చేస్తారు. ప్రైవేటు కేటాయించిన ఎరువులను ప్రైవేటు దుకాణాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తారు. పద్ధతి ప్రకారం ఇలా జరుగుతుంది. మరి అలా కాకుండా మార్క్ ఫెడ్ ఇవ్వాల్సిన 50% ఎరువులను తగ్గించి ప్రైవేటు కేటాయించడం అత్యంత దుర్మార్గం. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ కూడా రాష్ట్రంలో ఎరువుల కొరత లేదని గతంలో కన్నా ఎక్కువే ఇచ్చామని చెప్తున్నారు గతంలో కన్నా యూరియా సహా ఎరువులు ఇస్తే రైతులకు ఎందుకు దొరకడం లేదు అన్నారు. సాగు విస్తీర్ణం కూడా ఈ ఖరీఫ్ సీజన్లో తగ్గినప్పుడు ఎరువుల లభ్యత ఎందుకు లేదు. ఈ విషయాలు చూస్తుంటే ఎరువులను బ్లాక్ తరలించి సొమ్ము చేసుకున్నారని సులభంగా అర్థం చేసుకోవచ్చు. సమస్య ప్రైవేటు వ్యక్తుల నుంచి వస్తుందని అనుకున్నప్పుడు వెంటనే ప్రభుత్వ విభాగమైన మార్క్ ఫెడ్ కు కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మా ప్రభుత్వంలో పెట్టిన గ్రామ వార్డు సచివాలయాలు ఆర్బికేల సిబ్బంది ప్రతి గ్రామాలలోనూ ఉన్నారు కదా వారి సేవలను ఎందుకు వాడుకోలేదు. గతంలో మేము చేసినట్టుగా ఆర్బికేల ద్వారా ఎరువుల పంపిణీ ఎందుకు చేపట లేదు. రైతులకు చేదోడుగా నిలిచే ఆర్బికేల వ్యవస్థను నాశనం చేశారు ఉచిత పంటల బీమాకు పాతర వేశారు.ఏ సీజన్లో పంట నష్టం వస్తే అదే సీజన్లో ముగిసే లోపు ఇచ్చే ఇన్ పుట్ సబ్సిడీ మరుసటి సీజన్ లోగా ఇచ్చే క్రాప్ ఇన్సూరెన్స్ (నష్ట పరిహారం) ను అందించే పద్ధతిని ధ్వంసం చేశారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తివేశారు. రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. యూరియా సహా ఎరువులను కొరత లేకుండా చూడాలి. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నలుమూలల నుండి రైతులు, నాయకులు, కార్యకర్తలు, వైయస్సార్సీపి అభిమానులు పాల్గొన్నారు.



# గూగుల్ రూపురేఖలే మార్చిన జెన్నీఫర్

చాలామంది ఏ విషయాన్నైనా సరే సెర్చ్ చేయడం కోసం గూగుల్ ను ఉపయోగిస్తారు. గూగుల్ మనకు తెలియని ప్రతి ఒక్క విషయాన్ని తెలియజేస్తుంది. అంతేకాదు ఏ విషయాన్ని అయినా పూర్తి డేటాతో మనకు అందుబాటులోకి తీసుకువస్తుంది. అయితే అలాంటి గూగుల్ ని చాలామంది ప్రజలు సమాచారం తెలుసుకోవడానికి కాకుండా అందులో ఉన్న ఫోటోలు చూడడానికి కూడా ఇష్టపడతారు.. కానీ బిజీ లైఫ్ స్టైల్ కారణంగా.. గూగుల్ లో ఉండే కథనాన్ని చదివడానికంటే ఎక్కువగా ఫోటోలు చూడడానికి మక్కువ చూపిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదంతా బాగానే ఉన్నా.. ఆ గూగుల్ లో ఉండే ఇమేజెస్ ఎవరివల్ల సృష్టించబడ్డాయో మాత్రం చాలా మందికి తెలియదు. మరి గూగుల్ ఇమేజెస్ సృష్టించడానికి మూలకారణం ఎవరు? ఎవరివల్ల ఈ గూగుల్ ఇమేజెస్ పుట్టుకొచ్చాయి? అనేది ఇప్పుడు తెలుసుకుందాం..గూగుల్ ఇమేజెస్ సృష్టించడానికి ప్రధాన కారణం ఎవరో కాదు అమెరికన్ గాయని జెన్నీఫర్ లోపేజ్.. జెన్నీఫర్ లోపేజ్ కి గూగుల్ ఇమేజెస్ కి మధ్య ఉన్న సంబంధం ఏంటి? అని మీకు డౌట్ రావచ్చు.అయితే వీరి మధ్య ఉన్న సంబంధం ఏంటంటే.. 2000 సంవత్సరంలో జెన్నీఫర్ లోపేజ్ గ్రామీ అవార్డ్స్ కి వచ్చిన టైంలో వెర్సాస్ ని ధరించింది.. జెన్నీఫర్ ధరించిన ఐకానిక్ గ్రీన్ వెర్సాస్ డ్రెస్ ఎంతోమందిని ఆకట్టుకుంది. అయితే జెన్నీఫర్ లోపేజ్ వేసుకున్న ఆ డ్రెస్ వైరల్ అవ్వడంతో చాలామంది ఆమె వేసుకున్న డ్రెస్ కు సంబంధించిన ఫోటోల కోసం గూగుల్ లో విపరీతంగా సెర్చ్ చేశారు. కానీ ఆ సమయంలో ఆ ఫోటోలు అందుబాటులో లేవు. ఈ విషయం గూగుల్ దృష్టికి వెళ్లడంతో చాలామంది కథనాలు చదవడం కంటే ఫోటోలు చూడడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు అని గ్రహించిన గూగుల్ యాజమాన్యం ఇక అప్పటినుంచి ఫోటోలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సమాచారం. అలా జెన్నీఫర్ లోపేజ్ వేసుకున్న డ్రెస్ ని చాలామంది గూగుల్ లో వెతకడంతో.. గూగుల్ ఇమేజెస్ సృష్టించడానికి మూల కారణం అయ్యాయి అంటూ గూగుల్ సీఈవో ఎరిక్ స్మిత్ అప్పట్లో వెల్లడించారు. జెన్నీఫర్ లోపేజ్ డ్రెస్ బాగుండడంతో చాలామంది జనాలు గూగుల్ లో 'ఓకే గూగుల్ నాకు వెర్సాస్ జంగిల్ డ్రెస్ చూపించు' అంటూ సెర్చ్ చేశారట.. ఇక ఈ కారణంగానే గూగుల్ లో ఇమేజెస్ సెర్చ్ ఇంజన్ ని సృష్టించారు. ఇక ఈ విషయం గురించి అప్పట్లో గూగుల్ సీఈవో , ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అయినటువంటి ఎరిక్ స్మిత్ మాట్లాడుతూ.. "చాలామంది ప్రజలు టెక్స్ట్ కంటే ఎక్కువగా ఫోటోలను చూడ్డానికే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారని 2000 సంవత్సరం గ్రామీ అవార్డుల తర్వాత తెలిసి వచ్చింది.




# బెల్లంకొండ ఆవేదన రైటే

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్.. ఇప్పుడు కిష్కింధపురి మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. హారర్ జోనర్ లో చావు కబురు చల్లగా ఫేమ్ కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కిస్తున్న ఆ మూవీలో యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. సెప్టెంబర్ 12వ తేదీన రిలీజ్ కానుంది. అయితే సోలోగా మూవీని రిలీజ్ చేయాలనే ఆలోచనతో కిష్కింధపురి మేకర్స్.. చాలా రోజుల క్రితమే విడుదల తేదీని అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్లే ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. దీంతో తమ సినిమాను సింగిల్ గా రిలీజ్ చేస్తామనుకున్నారు. కానీ ఇంతలో మరో యంగ్ హీరో తేజ సజ్జా మిరాయ్ కూడా అదే డేట్ న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. నిజానికి.. మిరాయ్ సెప్టెంబర్ 5వ తేదీన రిలీజ్ అవ్వాల్సి ఉంది. అందుకే కిష్కింధపురి మేకర్స్ వారం గ్యాప్ లో సెప్టెంబర్ 12వ తేదీని ఫిక్స్ చేశారు. కానీ ఇప్పుడు మిరాయ్ తో పోటీ పడాల్సి వస్తుంది. దీంతో ఓపెనింగ్స్ పై ఎఫెక్ట్ పడనుంది. అయితే కిష్కింధపురి మేకర్స్ మాత్రం తమకు చెప్పకుండా మిరాయ్ వాళ్లు డేట్ అనౌన్స్ చేశారని అంటున్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ కూడా రీసెంట్ గా అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఆయన ఆవేదన చెందడం రైటే కానీ అన్ని విధాల ఆలోచించాలి. ఎందుకంటే మిరాయ్ సెప్టెంబర్ 19న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ అక్కడి వారం రోజుల్లో పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ.. 25వ తేదీన రిలీజ్ కానుంది. అందుకే 12వ తేదీని ఎంచుకున్నట్లు ఉన్నారు. అయితే కిష్కింధపురి మేకర్స్ ప్లాన్ తో సోలోగా ముందుకు వచ్చారు. కానీ ఇప్పుడు మిరాయ్ వల్ల ఓపెనింగ్స్ విషయంలో దెబ్బతినే అవకాశం ఉంది. అది ఎవరూ ఏం చేయాలని పరిస్థితి. అయితే కంటెంట్ బాగుంటే ఓపెనింగ్స్ తగ్గినా.. తర్వాత మాత్రం దూసుకుపోవడం పక్కా. కంటెంట్ సూపర్ గా ఉంటే ఎంత పోటీ ఉన్నా కూడా ఇబ్బంది లేదు. అదే సమయంలో జోనర్స్ పరంగా చూసుకుంటే మిరాయ్ కు కాస్త బెనిఫిట్ ఎక్కువ ఉంటుంది. ఫాంటసీ జానర్ కాస్త ఎక్కువ మంది ఇంట్రెస్ట్ చూపుతారు. కిష్కింధపురి హారర్ జానర్ కాబట్టి పరిమిత ఆడియన్స్ ఉంటారు. ఏదేమైనా అన్ని విధాలుగా ఆలోచిస్తే కిష్కింధపురికి పోటీ తప్పదు. మరి సినిమా ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

### సోలో రిలీజ్ రష్మిక మూవీకి

# కలిసి వచ్చేనా..?



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగు వెలుగుతున్న రష్మిక మందన్న మరో వైపు బాలీవుడ్‌లోనూ వరుస సినిమాలతో అలరించే ప్రయత్నం చేస్తోంది. 2022లో 'గుడ్ బై' సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన రష్మిక మందన్న ఆ సినిమాతో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. పుష్ప సినిమాతో వచ్చిన క్రేజ్‌తో హిందీలో వరుస ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా బ్యాక్ టు బ్యాక్ సినిమా ఆఫర్లు సొంతం చేసుకుంది. 2023లో మిషన్ మజ్ను సినిమాతో వచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయినా కూడా రణబీర్ కపూర్ హీరోగా తెలుగు దర్శకుడు సందీప్ వంగ దర్శకత్వంలో వచ్చిన యానిమల్ సినిమాలో హీరోయిన్‌గా నటించింది. యానిమల్ సినిమా దాదాపుగా వెయ్యి కోట్ల రూపాయల వసూళ్లు సాధించడంతో పాటు, రష్మికకి మంచి స్టార్‌డం తెచ్చి పెట్టింది. సికిందర్‌తో రష్మిక మందన్న ఫ్లాప్.. యానిమల్ తర్వాత బాలీవుడ్ నుంచి మరిన్ని సినిమా ఆఫర్లు వస్తున్నాయి. రష్మిక ఒప్పుకోవాలే కానీ ఏడాదికి రెండు మూడు బాలీవుడ్ సినిమాలను చేసే అవకాశాలు వచ్చాయట. కానీ రష్మిక మాత్రం ఆచితూచి సినిమాలు చేస్తూ వచ్చింది. ఛావా సినిమాతో మరో బ్లాక్ బస్టర్‌ను బాలీవుడ్‌లో అందుకున్న రష్మిక మందన్నకి సల్మాన్ ఖాన్ తో నటించిన సికిందర్ సినిమా చాలా పెద్ద నిరాశను మిగిల్చింది. మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన సికిందర్ మూవీ బాక్సాఫీస్ వద్ద పెద్ద ఫ్లాప్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈమె చేతిలో బాలీవుడ్ మూవీ 'థామ' ఉంది. వచ్చే నెలలో దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా విషయమై రష్మిక చాలా నమ్మకంగా కనిపిస్తుంది. ఈ సినిమాను అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. థామాతో రష్మిక మందన్న హిట్ గ్యారెంటీ టాలీవుడ్ సినిమాలకు సంక్రాంతి, దసరా సీజన్ అత్యంత కీలకమైనది అనడంలో సందేహం లేదు. ప్రతిసారి మాదిరిగానే ఈ సారి కూడా దీపావళికి మూడు నాలుగు సినిమాలు బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పోటీకి నిలుస్తాయని అనుకున్నారు. క్రిస్మస్ కానుకగా ఆసినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంతే కాకుండా కాంతార చాప్టర్ 1 సినిమాను సైతం 2025 దీపావళికి వస్తుం దని అంతా భావించారు. కానీ ధురంధర్ సినిమా మాదిరిగానే కాంతార సినిమా దీపావళి బరిలో నిలవడం లేదు. ఇతర హిందీ సినిమాలు ఏవీ కూడా దీపావళికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దాంతో థామ సినిమా సోలో రిలీజ్ కానుంది.

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006.
AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR